క్లుప్తంగా

నేడు ముత్యాలమ్మ హుండీ ఆదాయం లెక్కింపు

మొగల్తూరు: మండలంలోని ముత్యాలపల్లి గ్రామంలో ఉన్న బండి ముత్యాలమ్మ వారి హుండీ ఆదాయాన్ని బుధవారం లెక్కించనున్నట్లు ఆలయ ఈఓ డి.రామకృష్ణంరాజు తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. ఆలయ ఆవరణలో నిర్వహించే లెక్కింపు కార్యక్రమంలో పాల్గొనే భక్తులు ముందుగా తమ కార్యాలయంలో పేర్లు నమోదు చేయించుకోవాలని కోరారు.

విద్యాసామగ్రి అందజేత



విద్యార్థులకు ఐడీ కార్డులు అందిస్తున్న దాత

పాలకొల్లు సెంట్రల్: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థులకు తనవంతు సహాయ సహకారాలు అందించాలనే సంకల్పంతో విద్యాసామగ్రి అందజేస్తున్నామని దాత వంకదార వేణు అన్నారు. మంగళవారం స్థానిక పెదగరువు ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు ఐడీ కార్డు, టై, ర్యాంక్ కార్డులతో పాటు విద్యాసామగ్రిని అందించారు. వేణు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు ఐడీ కార్డులు అందజేయాలని ఒక లక్ష్యం పెట్టుకున్నానన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం నిల్లా సురేష్ బాబు, ఉపాధ్యాయులు పి.లక్ష్మీనారాయణ, సీఆర్ఎంటీ బీపీ వినయలత, అంగన్‌డీ కార్యకర్త జి ప్రశాంతి తదితరులు పాల్గొన్నారు.

జీఓ 115ను రద్దు చేయాలి



ఆసుపత్రి వద్ద ఆందోళన చేస్తున్న దృశ్యం

నరసాపురం: జీఓ–115 రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం నరసాపురం ఏరియా ప్రభుత్వ ఆసుపత్రి గేట్ వద్ద నర్సులు ఆందోళన చేశారు. కాంట్రాక్ట్ స్టాఫ్ నర్స్ స్ట్రగుల్ కమిటీ, ఏపీ మెడికల్ ఎంప్లాయీస్ యూనియన్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆసుపత్రి కాంట్రాక్ట్ స్టాఫ్ నర్స్ స్ట్రగుల్ కమిటీ అధ్యక్షురాలు సీహెచ్ చిట్టితల్లి మాట్లాడుతూ జీఓ–115 ద్వారా ప్రభుత్వం ఎవరైతే ఏఎన్ఎంలుగా ఉండి ఇంటెన్సిఫైడ్ శిక్షణ తీసుకున్నారో వారిని స్టాఫ్ నర్స్‌లుగా నియమించాలని నిర్ణయించతగదన్నారు. వెంటనే జీఓ రద్దు చేయాలని డిమాండ్ చేశారు. జీవో రద్దు చేసే వరకూ దశలవారీగా ఆందోళనలు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కె.పవిత్ర, ఎం.సుష్మి, ఆర్ విమల, హెల్త్ కౌన్సిలర్ జేసు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

భీమవరం పట్టణంలో పారిశుద్ధ్యంపై నిర్లక్ష్యం



మెంటేవారితోట రైల్వే అండర్ టన్నెల్ వద్ద నిలిచిపోయిన వర్షపు నీరు

భీమవరం(ప్రకాశం చౌక్): భీమవరం పట్టణంలో దోమల నివారణకు ఫాగింగ్ లేదు. కనీసం బ్లీచింగ్ పౌడర్ కూడా చల్లడం లేదు. దీంతో ప్రజలు దోమల వల్ల ఏ రోగం వస్తుందోనని భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. భీమవరం పట్టణ వీధులు వర్షం నీరు బయటకెళ్ళిన తర్వాత వీధి రోడ్లు బురద మయంగా, డ్రెయినేజీలు అధ్వానంగా మారాయి. దీంతో దోమలు విజృంభిస్తున్నాయి. మున్సిపల్ అధికారులు గత పదిరోజులుగా పారిశుద్ధ్య చర్యలు చేపట్టకపోవడంతో ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఫాగింగ్ ఒక వార్డులో చేసి మరో ఒక వార్డులో చేయడం లేదు. కొన్నిచోట్ల వీధిరోడ్లపై ఇప్పటికీ నీరు నిల్వ ఉండడంతో దుర్గంధం వెదజల్లి ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికైన అధికారులు స్పందించి దోమల నివారణ, పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలని వారు కోరారు.

పౌష్టికాహారం తీసుకోవాలి

భీమవరం అర్బన్: తల్లులు ఐసీడీఎస్ సేవలను సద్వినియోగం చేసుకుని ఆరోగ్యవంతమైన బిడ్డలకు జన్మనివ్వాలని భీమవరం ఐసీడీఎస్ సీడీపీఓ టీకేవీ లక్ష్మీకాంతం అన్నారు. పౌష్టికాహార మాసోత్సవాలలో భాగంగా మంగళవారం భీమవరంలోని గూట్లపాడు అంగన్‌వాడీ కేంద్ర కార్యాలయంలో పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా లక్ష్మీకాంతం మాట్లాడుతూ గర్భిణులు విధిగా పౌష్టికాహారం తీసుకోవాలని, క్రమం తప్పకుండా వ్యాయామం చేయాలని సూచించారు. కిషోర బాలికలు నుంచి బాలింతలు వరకు ఎప్పటికప్పుడు రక్త పరీక్షలు చేయించుకుంటూ తద్వారా వచ్చిన ఫలితాలు ఆధారంగా ఐరన్ మాత్రలు, పౌష్టికాహారం ఇస్తున్నామని తెలిపారు. తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషకాలు ఉండే ఆకు కూరలు, కూరగాయలు, పప్పు దినుసులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్ వైజర్ డి.అనిల్‌కుమారి, ఏడబ్ల్యాడబ్ల్యూస్ మేరీ, ప్రసన్న, రాజేశ్వరి, సత్య హరిణి, హెల్త్ స్టాఫ్, గర్భిణులు, తల్లులు, ఐసీపీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

మళ్లీ భయపెడుతున్న విషపుటీగలు

నరసాపురం రూరల్: నరసాపురం తీర ప్రాంతంలో మళ్లీ విషపుటీగలు హల్‌చల్ చేస్తున్నాయి. సునామీ కల్లోలం సృష్టించిన అనంతరం తీరం విషపు ఈగలు కొంతకాలం పాటు పలు తీరప్రాంత గ్రామాల్లో కనిపించేవి. తీరప్రాంత గ్రామాల్లో చెట్లపై తిష్ట వేసి చెట్లు ఎక్కినవారిపై దాడి చేసేవి. అప్పట్లో ప్రభుత్వ అధికారులు వాటి నిర్మూలనకు ఓఎన్‌జీసీ, ఫైర్, వ్యవసాయ తదితర శాఖల సలహాలు సూచనలతో విషపు ఈగల తుట్టెలను మంట పెట్టి నిర్మూలించేవారు. అయితే అనంతరం కొంత కాలం వాటి అలికిడి అంతగా లేదు. ఇటీవల కాలంలో పట్టణానికి ఆనుకుని ఉన్న గ్రామాల్లోనూ తాజాగా నరసాపురం పట్టణంలోని ఒక మసీదు ప్రాంగణంలోకూడా దర్శనమిస్తుండటంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. 2004 సునామి తరువాత సముద్రం మీదుగా నరసాపురం తీరప్రాంతానికి వచ్చిన ఈ విషపు ఈగలు అప్పట్లో నరసాపురం, మొగల్తూరు తీరప్రాంతాల్లో కనిపించాయి. సునామి వచ్చిన ఏడాదిలోనే పేరుపాలెం గ్రామంలో ఈ ఈగల దాడిలో గాయపడిన ఇద్దరు వ్యక్తులు తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. అదేసమయంలో పలు పశువులు కూడా మృత్యువాత పడ్డాయి.

మళ్లీ అలజడి

గత నాలుగైదేళ్లుగా ఈ విషపు టీగల జాడ కనిపించలేదు. అయితే తిరిగి ఇటీవల కాలంలో రుస్తుంబాద గాదెవారితోటలో కనిపించిన విషపు టీగలను గ్రామస్తులే మంటవేసి మట్టుపెట్టారు. అయితే తాజాగా నరసాపురం పట్టణంలోని ఓ మసీదు ప్రాంగణంలో చెట్టుకు ఈ విషపుటీగల తుట్టె ఉండటంతో ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు. విషపుటీగల గూళ్ల దర్శనమిస్తుండటంతో ప్రజల్లో అలజడి మొదలైంది. తేనెటీగలను పోలి ఉండే ఈ ఈగలు కుట్టిన వెంటనే విపరీతమైన బాధ, భరించలేని నొప్పి వస్తోంది. ఈ ఈగలు కుడితే రక్తం విరిగి మనుషులు చనిపోతారనే ప్రచారం కూడా ఊపందుకోండంతో ప్రజల్లో మరింత అలజడి నెలకొంది.



నరసాపురం పట్టణంలోని విషపుటీగల తుట్టె
విషపుటీగ (ఫైల్)

సకాలంలో వైద్యం చేయించుకోవాలి



తూర్పు, దక్షిణ ఆసియా ప్రాంతాల్లో ఈ విషపు టీగలు కనిపిస్తుంటాయి. కొండ కందిరీగల మాదిరిగా ఉండే ఈ ఈగలు పెద్ద కీటకాలు, చెట్లరసాలు, తేనెటీగల నుంచి తేనెను ఇవి ఆహారంగా స్వీకరిస్తుంటాయి. ఇవి కుడితే మనిషి చనిపోయేంత ప్రమాదం కాదు గానీ, భరించలేని నొప్పి ఉంటుంది. అయితే ఈ ఈగలు మూకుమ్మడిగా దాడి చేస్తే మనిషి చనిపోయే ప్రమాదం ఉంటుంది. సకాలంలో వైద్యం చేయించుకోవాల్సి ఉంటుంది.

– కొల్లాటి పావని, జువాలజీ లెక్చరర్

13న ఆచంట మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

పెనుగొండ: ఆచంట మండల సర్వసభ్య సమావేశం ఈ నెల 13న నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ పి నరసింహప్రసాద్ తెలిపారు. మంగళవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ శుక్రవారం ఎంపీపీ దిగమర్తి సూర్యకుమారి అధ్యక్షతన సమావేశం నిర్వహిస్తామని, ప్రజా ప్రతినిధులు, అన్ని శాఖల అధికారులు హాజరు కావాలని కోరారు.

వరద బాధితులను ఆదుకోవాలి

పెనుగొండ: భారీ వర్షాలకు నష్టపోయిన వరద బాధితులను తక్షణం ఆదుకోవాలని సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మంతెన సీతారామ్ డిమాండ్ చేశారు. పోడూరు మండలం కవిటంలో మంగళవారం సీపీఎం కార్యకర్తలు సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఎన్నడూ లేనంతగా వర్షాలు పడడంతో లక్షలాది మంది ప్రజలు నిరాశ్రులయ్యారన్నారు. బాధితులకు మూడు నెలల ఈఎంఐలు మినహాయింపు ఇచ్చేలా బ్యాంకర్లకు ఆదేశాలు జారీ చేయాలన్నారు. రైతులను ఆదుకోవడానికి అన్ని చర్యలు తీసుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి బి.బలరామ్, కేతా గోపాలన్ డిమాండ్ చేశారు.

వేగంగా పారిశుద్ధ్య పనులు

పెనుగొండ: ఇటీవల కురిసిన భారీ వర్షాలకు అంటు వ్యాధులు ప్రబలకుండా ఆచంట పంచాయతీ పరిధిలో పారిశుద్ధ్య నిర్వహణ పనులు వేగవంతం చేశారు. మంగళవారం కాలనీల్లో ప్రత్యేక పారిశుద్ధ్య పనులు చేపట్టారు. బ్లీచింగ్ చల్లించారు. దోమల ప్రబలకుండా స్ప్రే చేయించారు. పారిశుద్ధ్య పనులను సర్పంచ్ కోట సరోజనీ వెంకటేశ్వరరావు, కార్యదర్శి జి.నాగబాబు తదితరులు పర్యవేక్షించారు.

వ్యక్తిపై దాడి..కేసు నమోదు

ఉండి: రోడ్డుపై వెళుతున్న వ్యక్తిపై వినాయక నిమజ్జన సమయంలో మరోవ్యక్తి దాడి చేయడంతో పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఉండి చిక్కాల వీరన్ననగర్‌కు చెందిన రాపాక సాంబశివ అనే వ్యక్తి ఉండిలోని ఓ దుకాణంలో పని చేస్తున్నాడు. ఈ నెల 9న రాత్రి 8.30 గంటల సమయంలో దుకాణం మూసివేసి కొత్తపేటలో ఉంటున్న తన యజమాని బాబుకు తాళాలు ఇచ్చి తిరిగివస్తున్న సమయంలో పోస్టాఫీసుకు సమీపంలో వినాయక నిమజ్జన కార్యక్రమం జరగడంతో సాంబశివ తన ద్విచక్రవాహనంపై జనానికి పక్కగా వెళుతుండగా అక్కడే వున్న సిరికి దుర్గారావు అనే వ్యక్తి ఇటుగా వెళ్లకూడదంటూ దుర్భాషలాడి బైక్‌పై ఉన్న వ్యక్తిని కిందకు లాగి తన్ని కొట్టడంతో అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. విషయం తెలుసుకున్న అతని యజమాని వచ్చి బాధితుడిని భీమవరం ప్రభుత్వాసుపత్రికి తరలించి చికిత్స అందించారు.ఆసుపత్రి నుంచి అందిన సమాచారం మేరకు దాడి చేసిన వ్యక్తిపై కేసు నమోదు చేశారు.

క్యాన్సర్ పేషెంట్ల కోసం జుట్టు దానం



జుట్టు దానం చేసిన గోవర్ధన్

పాలకొల్లు సెంట్రల్: పట్టణానికి చెందిన యువకుడు ఏఎన్‌పీకే ఫౌండేషన్ అధ్యక్షుడు చెన్నంశెట్టి గోవర్ధన్ వినూత్నమైన దానం చేసి ప్రజల్లో గుర్తింపు పొందాడు. గోవర్ధన్ వినూత్నంగా జుట్టు దానం చేశాడు. ఈ సందర్భంగా గోవర్ధన్ మాట్లాడుతూ క్యాన్సర్ పేషెంట్లకు కీమోథెరపీ చేస్తుంటారని ఆ సందర్భంలో పేషెంట్‌కు జుట్టు ఊడిపోతుందని తెలిపారు. ఆ సమయంలో కొందరు మహిళలు నలుగురిలో తిరగడానికి ఇబ్బంది పడుతుంటారని అటువంటి మహిళలు విగ్ ఏర్పాటుచేసుకోవడానికి వేలల్లో ఖర్చవుతుందని తెలిపారు. ఒక విగ్‌కు సుమారు రూ. 20 వేల నుండి రూ. 70 వేల వరకూ ఖర్చవుతుందన్నారు. అంత ఖర్చు పెట్టుకునే ఆర్థిక స్తోమత లేని మహిళా పేషెంట్లకోసం తనవంతు సహాయ సహకారాలు అందించాలనే సంకల్పంతో తాను గత 15 నెలలుగా హెయిర్ పెంచానని అన్నారు. హైదరాబాద్‌కు చెందిన ఎయిర్ డొనేషన్ సంస్థ సభ్యులు పేషెంట్లకు ఉచితంగా విగ్గులు అందజేస్తున్నారని తెలిసి తన జుట్టు ఆ సంస్థకు అందజేశానని తెలిపారు.

వరదను సమర్థంగా ఎదుర్కొంటాం



యలమంచిలిలో విలేకరులతో మాట్లాడుతున్న నరసాపురం ఆర్డీఓ ఎం.అచ్యుతఅంబరీష్

యలమంచిలి: గోదావరిలో వరద పెరుగుతున్న నేపథ్యంలో నరసాపురం డివిజన్‌లోని పెనుగొండ, ఆచంట, యలమంచిలి, నరసాపురం మండలాల్లో వరద ప్రభావిత గ్రామాల ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని నరసాపురం ఆర్డీఓ ఎం అచ్యుత అంబరీష్ కోరారు. వరద హెచ్చరికల నేపథ్యంలో మంగళవారం ఆయన యలమంచిలి తహసీల్దార్ కార్యాలయంలో స్థానిక అధికారులతో వరద సహాయక చర్యలపై సమీక్ష నిర్వహించారు. అనంతరం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ గోదావరిలో వరద నీరు భారీగా వచ్చే అవకాశం ఉన్నట్లు సమాచారం ఉందన్నారు. వరద వలన ప్రజలకు, జంతువులకు ఎటువంటి ఆపద కలగకుండా సమర్థంగా ఎదుర్కుంటామని ఆయన చెప్పారు. ప్రభావిత గ్రామాలైన కనకాయలంక, పెదలంక, కంచుస్తంభంపాలెం, దొడ్డిపట్ల, అబ్బిరాజుపాలెం, గంగడుపాలెం, లక్ష్మీపాలెం, యలమంచిలిలంక, ఏనుగువానిలంక, బాడవ గ్రామాలలో వరద సహాయక బృందాలను ఏర్పాటు చేశామన్నారు. ఈ సహాయక బృందాలు మూడు షిఫ్ట్‌లో 24 గంటలు పని చేసేలా మూడు బృందాలను నియమించామన్నారు. మండల స్థాయి అధికారులంతా ఈ బృందాలను పర్యవేక్షిస్తారన్నారు. గర్భిణులు, బాలింతలు, వికలాంగులు, వృద్ధులు, దీర్ఘకాలిక రోగాలతో బాధపడుతున్నవారు సురక్షిత ప్రాంతాలకు వెళ్లేలా చర్యలు తీసుకోమని ఆదేశాలిచ్చామన్నారు. వరద పెరిగితే పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేస్తామని, వరద ప్రభావిత గ్రామాల్లోని ప్రజలు అధికారులను ఇబ్బందులకు గు రిచేయకుండా పునరావాస కేంద్రాలకు రావాలని ఆయన కోరారు. ముందు జాగ్రత్త చర్యగా వరద ప్రభావిత గ్రామాల్లో మూడు నెలలకు సరిపడా బియ్యం, నిత్యావసర సరుకులు నిల్వ చేసినట్లు ఆయన వివరించారు. వరద ప్రభావం ఉన్న ప్రతి మండలంలో కంట్రోల్ రూమ్స్ ఏర్పాటు చేశామని ప్రజలు ఏ అవసరం వచ్చిన టోల్ ఫ్రీ నెంబర్‌కు కాల్ చేయాలని ఆయన కోరారు.

నరసాపురంలో..

నరసాపురం రూరల్: రానున్న వరద ఉధృతికి సంబంధించి ముంపు ప్రాంతాల్లో నష్టం జరగకుండా తీసుకోవాల్సిన చర్యలపై అధికారులతో మంగళవారం ఆర్డీవో అచ్యుత అంబరీష్ మాట్లాడారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో జరిగిన ఈ సమావేశంలో ఆర్డీఓ మాట్లాడుతూ తుంగభద్రలో రెండవ ప్రమాద హెచ్చరిక జారీ చేయనున్న నేపథ్యంలో అధికారులందరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. అధికారులకు, సిబ్బదికి సెలవులను రద్దు చేయాలన్నారు. గణేష్ నిమజ్జనోత్సవాలను పురస్కరించుకుని వశిష్ట గోదావరిలోకి ఎవరూ దిగవద్దని, కేవలం క్రేన్లు ఉపయోగించి మాత్రమే నిమజ్జనం చేయాలని కోరారు. ఈ సమావేశంలో తహసీల్దార్ రాజరాజేశ్వరి పాల్గొన్నారు.

పెనుగొండలో..

పెనుగొండ: గోదావరికి వరద నీరు ఉధృతంగా వస్తున్నందున అధికారులంతా అప్రమత్తంగా ఉండాలని నరసాపురం ఆర్డీఓ అచ్యుత్ అంబరీష్ ఆదేశించారు. మంగళవారం ఆచంట తహసీల్దారు కార్యాలయంలో నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో అధికారులకు పలు సూచనలు ఇచ్చారు. సమావేశంలో తహసీల్దార్ బి.సుగుణ సంధ్య, ఎంపీడీఓ నరిసింహమూర్తి పాల్గొన్నారు.

గోదావరి వరద పర్యవేక్షణ

పెనుగొండ: ఎగువ నుంచి గోదావరికి వరద నీరు పోటెత్తుతుండడంతో మంగళవారం సిద్ధాంతం గోదావరి వరద నీటీ ఉధృతిని తహసీల్దారు జి.అనితకుమారి పరిశీలించారు. వరద నీరు భారీగా వస్తుందన్న సమాచారం ఉండడంతో ఎక్కడికక్కడ రక్షణ చర్యలు చేపట్టాలని అధికారులకు సూచనలు చేశారు. దొంగరావిపాలెం, సిద్ధాంతం, నడిపూడి, చిన మల్లం లంకల వద్ద రైతులు అప్రమత్తంగా ఉండాలన్నారు. మధ్యస్థ లంక పాడి రైతులతో మాట్లాడి పలు సూచనలు చేశారు. ఆర్ఐ కిరణ్ కుమార్, వీఆర్వో బాలాజీ పాల్గొన్నారు.

ఫెర్రీ ఆదాయం మున్సిపాలిటీకి అందించాలి



ఆర్డీఓకు వినతిపత్రం ఇస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్, కౌన్సిలర్లు

నరసాపురం: మాధవాయిపాలెం ఫెర్రీ ఆదాయంలో 25 శాతం వాటా మున్సిపాలిటీకి చెందేలా చర్యలు చేపట్టాలని నరసాపురం మున్సిపల్ కౌన్సిలర్లు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం నరసాపురం ఆర్డీఓ ఎం.అచ్యుత్ అంబరీష్‌ను కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్ బర్రి శ్రీవెంకటరమణ మాట్లాడుతూ మున్సిపాలిటీ పరిధిలో ఉన్న రేవు ఆదాయం మొత్తం మండల పరిషత్‌కు వెళ్తుందని ఆర్డీఓకు వివరించారు. రేవు వద్ద నిర్వహణ బాధ్యతలు అన్నీ మున్సిపాలిటీనే చూస్తుందని చెప్పారు. వీధి దీపాలు, పారిశుద్ధ్య నిర్వహణ అంతా మున్సిపాటినే చూస్తుందన్నారు. ఈ ఆదాయం విష్యంలో కౌన్సిల్ తీర్మానం చేసి జిల్లా కలెక్టర్‌కు కూడా అనేకమార్లు పంపామన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు కామన బుజ్జి, బర్రి జయరాజు, కావలి నాని, కేసరి గంగరాజు, సఖినేటిపల్లి సురేష్, వంగా శ్రీకాంత్ కన్నా, పాలూరి బాబ్జి, పతివాడ మార్కెండేయులు తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతోనే ఆరోగ్యవంతమైన సమాజం



యలమంచిలి: గుంపర్రులో ప్రతిజ్ఞ చేస్తున్న అంగన్‌వాడీ వర్కర్లు




పాలకొల్లు అర్బన్: ఉల్లంపర్రులో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

యలమంచిలి: పౌష్టికాహారంతోనే ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణం సాధ్యమనే సంగతి ప్రతి ఒకరికి వివరించాలని అంగన్‌వాడీ కార్యకర్తలను ఐసీడీఎస్ సీడీపీఓ సీహెచ్ ఇందిర కోరారు. పౌష్టికాహార మాసోత్సవాల కార్యక్రమంలో భాగంగా మంగళవారం గుంపర్రు గ్రామంలో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. దేశాభివృద్ధి చెందాలంటే ఆరోగ్యకరమైన యువతతోనే సాధ్యమన్నారు. యువత ఆరోగ్యంగా ఉండాలంటే తల్లి కడుపులో ఉన్న సమయం నుంచే బలవర్ధక ఆహారం అందించాలన్నారు. ఈ విషయాన్ని తల్లులందరికీ వివరించి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆమె కోరారు. అంగన్‌వాడీ కేంద్రాలలో బలవర్ధక ఆహారం ఇస్తున్న సంగతిని వివరించి ఐదేళ్లలోపు పిల్లలంతా అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చేలా చర్యలు తీసుకోవాలని ఇందిర కోరారు. కార్యక్రమంలో ఏసీడీపీఓ నాగరత్నం, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు మహ్మద్ హసీనా అంగన్‌వాడీ, ఆశ కార్యకర్తలు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.


పౌష్టికాహార అవగాహన ర్యాలీ

పాలకొల్లు అర్బన్: గర్భిణులు, బాలింతలు పౌష్టికాహార తీసుకోవడం వల్ల బిడ్డలు ఆరోగ్యవంతులుగా జీవిస్తారని మెడికల్ ఆఫీసర్ సత్యసౌజన్య అన్నారు. పాలకొల్లు మండలం ఉల్లంపర్రులో పౌష్టికాహార మాసోత్సవాల్లో భాగంగా మంగళవారం ఐసీడీఎస్ సీడీపీవో సీహెచ్ ఇందిర ఆదేశాల మేరకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ సత్యసౌజన్య మాట్లాడుతూ గర్భిణులు సరైన ఆహారం తీసుకోకపోవడం వల్ల రక్తహీనత సమస్యలతో ఇబ్బందులుపడతారన్నారు. పంచాయతీ కార్యదర్శి డీఎస్ పద్మాజీరావు, బి.నాగలక్ష్మి, ఎం.భాగ్యలక్ష్మి, బి.సురేఖ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా గణపతి నవరాత్రులు



నరసాపురం: చినమామిడిపల్లిలో ఏర్పాటు చేసిన భారీ గణపతి విగ్రహం



పెనుగొండ: గాంధీబొమ్మల సెంటర్‌లో పూజలందుకుంటున్న గణనాథుడు

నరసాపురం: వినాయక చవితి నవరాత్రి ఉత్సవాలు పట్టణంలో ఘనంగా నిర్వహిస్తున్నారు. మంగళవారం నరసాపురంలోని అన్ని మండపాల వద్ద పెద్ద ఎత్తున పూజలు చేశారు. మండపాల వద్ద విద్యుత్ అలంకరణలు ఆకట్టుకుంటున్నాయి. పండ్ల మార్కెట్ సెంటర్, పంజాసెంటర్, రాయిపేట మూడుబొమ్మల సెంటర్, చినమామిడిపల్లి, శనివారపుపేట, పీచుపాలెం, వనువులమ్మ గుడి, పొన్నపల్లి ప్రాంతాల్లో ఏర్పాటు చేసి భారీ గణపతి విగ్రహాలను పెద్దసంఖ్యలో భక్తులు తిలకించి పూజలు చేస్తున్నారు.

పెనుగొండలో..

పెనుగొండ: గణపతి నవరాత్రి ఉత్సవాలు మండలంలో ఘనంగా నిర్వహిస్తున్నారు. మంగళవారం ఉదయం గణపతికి అభిషేకాలు అర్చనలు నిర్వహించారు. పెనుగొండ గాంధీ బొమ్మల సెంటర్‌లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పెనుగొండ పంచాయతీ వద్ద సంపత్ వినాయకుని ఆలయంలో పూజలు నిర్వహించి వెండి తొడుగుతో వినాయకుడిని అలంకరించారు. సిద్ధాంతం, వడలి, జవ్వాదివారి వీధి, కంబాల వారి వీధి, చెరుకువాడల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఆరోగ్య పరిరక్షణకు చర్యలు తీసుకోవాలి



మొగల్తూరు ఆస్పత్రిలో గర్భిణీ ఆరోగ్య రికార్డులు పరిశీలిస్తున్న డాక్టర్ లక్ష్మీ పార్వతి

మొగల్తూరు: ఆరోగ్య పరిరక్షణకు ప్రతి ఒక్కరూ చర్యలు తీసుకోవాలని డాక్టర్ లక్ష్మీపార్వతి సూచించారు. ప్రధాన మంత్రి మాతృత్వ సురక్ష యోజన పథకంలో భాగంగా మొగల్తూరు ప్రభుత్వ ఆసుపత్రిలో మంగళవారం గర్భిణులకు పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ లక్ష్మీ పార్వతి మాట్లాడుతూ 76 మంది గర్భిణులను పరీక్షించామని, ముగ్గురు గర్భిణులను హైరిస్క్‌గా గుర్తించి మెరుగైన చికిత్స నిమిత్తం నరసాపురం ప్రభుత్వ ఆసుపత్రికి పంపామన్నారు. కార్యక్రమంలో ఆసుపత్రి సిబ్బంది సావిత్రి, జయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

హాస్టల్ విద్యార్థినులకు ఆరోగ్య పరీక్షలు

మొగల్తూరు: విద్యార్థినులు ఆరోగ్యంగా ఉండేందుకు తగు జాగ్రత్తలు తీసుకోవాలని డాక్టర్ కె.లక్ష్మీపార్వతి కోరారు. సాధారణ ఆరోగ్య పరీక్షల్లో భాగంగా మంగళవారం మొగల్తూరులోని ఎస్సీ బాలికల వసతి గృహంలోని విద్యార్థినులను ఆమె పరీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆహారం తీసుకునేముందు చేతులు శుభ్రం చేసుకోవాలని, వర్షంలో తడవద్దని, గ్రామంలో వైరల్ జ్వరాలు ఉన్నాయని, అందువల్ల కాచి చల్లార్చిన నీటిని తాగాలని సూచించారు. సుమారు 37 మంది విద్యార్థినులను పరీక్షించి మందులు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీహెచ్ఎస్ బి.శ్రీనివాసరావు, హాస్టల్ వార్డన్ కె.ధారవేణి, ఏఎన్ఎం పుష్పరాజ్యం తదితరులు పాల్గొన్నారు.


ఆత్మహత్యల నివారణపై అవగాహన



డిగ్రీ కళాశాలలో మాట్లాడుతున్న డాక్టర్ శంకర్

భీమవరం: క్షణికావేశంలో నిండుజీవితాన్ని ఆత్మహత్యప్రయత్నంతో బలిచేయకూడదని జిల్లా నోడల్ ఆఫీసర్ డాక్టర్ టి.శంకర్ అన్నారు. ప్రపంచ ఆత్మహత్యల నివారణ దినోత్సవం సందర్భంగా మంగళవారం స్థానిక ఆర్ఆర్‌డీఎస్ ప్రభుత్వ డిగ్రీకళాశాలలో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో ప్రతి ఏటా ఆత్మహత్యల పేరుతో సుమారు 9 వేల మంది మరణిస్తున్నారని, ఇందులో యువత సంఖ్య ఎక్కువగా ఉంటుందని చెప్పారు. కళాశాల ప్రిన్సిపాల్ వీకేజే ప్రసూన మాట్లాడుతూ యువత సరైన జీవన దృక్పథాన్ని అరవర్చుకుని, జీవితాన్ని సంపూర్ణంగా ఆస్వాదించాలని సూచించారు. అనంతరం ఆత్మహత్యలను నివారిస్తామంటూ విద్యార్థులతో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ కాకుమాని శ్రీనివాసరావు ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు పి.రాజశేఖర్, జి.ఉమామహేశ్వరి, డి.సత్యనారాయణ, పి.అమూల్యారావు, జి.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

డీఆర్‌యూసీ మెంబర్ కుమార్‌కు అభినందన



కుమార్‌ని అభినందిస్తున్న హోటల్స్ అసోసియేషన్ సభ్యులు

పాలకొల్లు అర్బన్: డివిజనల్ రైల్వే యూజర్స్ కమిటీ సభ్యులుగా రెండోసారి నియమితులైన హోటల్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు జక్కంపూడి కుమార్‌ను పట్టణ హోటల్స్ అసోసియేషన్ సభ్యులు మంగళవారం సత్కరించారు. పాలకొల్లు పరిసర ప్రాంతాల ప్రజలకు రైల్వే సౌకర్యాలు మరింత మెరుగు పరిచేలా పని చేయాలని కోరారు. కుమార్‌ను శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు. హోటల్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు దాసిరెడ్డి శ్రీనివాసరావు, చినిమిల్లి గణపతిరావు, సభ్యులు బైలా శ్రీధర్, దుడే రాము, సూరపరాజు, అడ్డాల ఏడుకొండలు, ప్రవీణ్, గుణ్ణం విశ్వేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల నిజాయతీ

ఆకివీడు: మండలంలోని దుంపగడప గ్రామంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన ముగ్గురు విద్యార్థులు యర్రా పవన్, తిరుమాని జయ కృష్ణ, సాయిరాంలు భోజన విరామ సమయంలో తిరిగి క్లాసుకు వెళుతున్న తరుణంలో రోడ్డుపై స్మార్ట్ ఫోన్ మంగళవారం దొరికింది. దానిని జేబులో పెట్టుకోకుండా నిజాయతీగా తమ ఉపాధ్యాయుడు పెంకి విజయ్ కుమార్‌కు అప్పగించారు. ఫోన్ యజమాని వివరాలను ఉపాధ్యాయుడు ఆరా తీసిమోపిదేవి శ్రీను అనే వ్యక్తికి చెందినదని తెలుసుకుని ఫోన్‌ను అతడికి అప్పగించారు.